TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 96 | ఆదివారం, ఆగస్టు 4, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

### మాదిగ జాతి ఎవరికి వ్యతిరేకం కాదు..

## దామోదర కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. తీర్పును ప్రభుత్వం భవిష్యత్తులో అమలు చేస్తుందని.. సీఎం రేవంత్ రెడ్డి శాసన సభలో ఒక స్టేట్మెంట్ ఇచ్చారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం సీఎం తనను పిలిచి కమిటీ వేసి, మాదిగ జాతికోసం ముందుకు వెళ్లాలని సూచించారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఈ అంశంలో వాదనలు వినిపించడంలో భాగమైందని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మాదిగ జాతి ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తాము సమానత్వం కోసం పోరాటం చేస్తున్నామని ఉద్ఘాటించారు. జాతినే అంటారని తనమంటే దుర్మార్గమని తీవ్రంగా వ్యతిరేకిస్తాం, ఖండిస్తామని అన్నారు. న్యాయ నిపుణులతో కమిటీ వేసి నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికు సమర్పిస్తామని వివరించారు. ఈ విషయంపై ఎలా ముందుకు వెళ్లాలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



## పవన్ అంటే మరీ ఇంత అభిమానమా

ఖమ్మం : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రం పవన్ కళ్యాణ్ చిత్రాన్ని తన రక్తంతో గీసి ఓ వ్యక్తి అభిమానాన్ని చాటుకున్నాడు. ముదిగొండ మండలానికి చెందిన మాణిక్యం అఖిల్ ఏపీ డిప్యూటీ సీఎం కి వీరాభిమాని. అభిమానానికి గుర్తుగా పవన్ చిత్రం వేయాలని సంకల్పించాడు. అయితే ఈ ఈ చిత్రం విభిన్నంగా ఉండాలని భావించాడు.. దీంతో రక్తంతో గీయాలని నిర్ణయించుకున్నాడు.. ఆ రక్తాన్ని కూడా తన శరీరం నుంచే తీసుకుని చిత్రాన్ని అయిదు గంటలలో పూర్తి చేశాడు.. ఇందు కోసం 5 ఎం ఎల్ రక్తాన్ని వినియోగించినట్లు మాణిక్యం చెప్పుకున్నాడు.. తన అభిమానాన్ని విభిన్నంగా తెలియజేయడానికి మాత్రమే ఇలా చిత్రం గీశానని ఆయన తెలిపారు.



### వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును

# స్వాగతిస్తున్నాం

**- ఎమ్మెల్యే కడియం**



జనగామ : సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉన్న ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని స్టేషన్ ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి అన్నారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని ఎన్ ఎమ్ ఆర్ గార్డెన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాల, మాదిగల ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేయాలనే డిమాండ్ తో చేపట్టిన ఉద్యమం నిరంతరం కొనసాగినప్పటికీ... ఈ వర్గీకరణ డిమాండ్ సుప్రీంకోర్టులో ఉందని, మాదిగ, మాల ఉపకులాల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు వర్గీకరణకు సానుకూలంగా తీర్పునివ్వడం శుభ పరిణామమన్నారు. ఈ వర్గీకరణతో అట్టడుగు పేద వర్గాలకు రాబోవు రోజుల్లో విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కలిగి వారి కుటుంబాలు ఆర్థికాభివృద్ధి చెందుతారన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అధికార, ప్రతిపక్ష మేధావులు, ప్రజలు ఏకమై అమలుకు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జగదీశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ, గుడి వంశీధర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, లింగాల గణపురం, మండల అధ్యక్షులు శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ జీ.. హైదరాబాద్ రండీ

### - మరోసారి అశోక్‌నగర్ వెళ్దాం - కెటిఆర్ ఆహ్వానం

హైదరాబాద్: 'రాహుల్ గాంధీ గారూ.. మీరు హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌కు మరోసారి వచ్చి.. యువతను కలిసి మీరు ఇచ్చిన హామీలను ఎలా నిలబెట్టుకుంటారో వారికి వివరించగలరా?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ చేశారు. ఈ మేరకు శనివారం ట్విట్టర్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. నవంబర్ 27, 2023న రాహుల్ గాంధీ చేసిన ట్వీట్‌ను కూడా కేటీఆర్ రీట్వీట్ చేశారు.

**మీ మాటలను యువత నమ్మారు..**

ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామనే మీ హామీలను తెలంగాణ యువత నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని ఆ ట్వీట్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పుడు ఎనిమిది నెలల తర్వాత కూడా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. పైగా నిన్న ఉద్యోగాలే లేని క్యాలెండర్‌ను విడుదల చేశారని, దీంతో యువత ఆందోళన చెందుతోందని పేర్కొన్నారు. అందుకే మీరు మరోసారి అశోక్ నగర్‌కు వచ్చి.. మీరు ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీలను ఎలా నెరవేరుస్తారో చెప్పాలన్నారు. కాగా, దీనికి రాహుల్ గాంధీ ఎన్నికలకు ముందు చేసిన ట్వీట్‌ను కూడా జత చేశారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, యూపీఎస్సీలా టీపీఎస్సీని ప్రక్షాళన చేస్తామని, యువవికాసం కింద ?5 లక్షల సహకారం అందిస్తామని రాహుల్ గాంధీ ఆనాడు చేసిన ట్వీట్‌ను కేటీఆర్ రీట్వీట్ చేశారు.



- ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.
- మీ మాటలను ఇక్కడి యువత గట్టిగా నమ్మారు
- ఎనిమిది నెలలు గడిచినా ఒక్క ఉద్యోగమూ లేదు
- ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు ఎలా నెరవేరుస్తారో చెప్పాలి

## మళ్లీ మోదీనే గ్లోబల్ లీడర్...




న్యూఢిల్లీ: భారత ప్రధాని మోదీ మరోసారి ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా నిలిచారు. మార్నింగ్ కన్సల్ట్ ఆఫ్ అమెరికా నిర్వహించిన సర్వేలో ప్రధాని మోదీ 69 శాతం ఓట్లతో మొదటి స్థానంలో నిలిచారు. ఈ సంవత్సరం, జూలై 8-14 మధ్య, మార్నింగ్ కన్సల్ట్ సర్వే సంస్థ ప్రతి దేశంలోని ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించిన తర్వాత ఈ జాబితాను విడుదల చేసింది. కాగా, ఈ జాబితాలో మొత్తం 25 మంది నేతలు షార్ట్ లిస్ట్ కాగా...మెక్సికో అధ్యక్షుడు లోపెజ్ ఒబ్రడార్ 63 శాతంతో రెండో స్థానంలో ఉన్నారు. జపాన్ ప్రధాని పుమియో కిషిడా ఈ జాబితాలో అట్టడుగు స్థానంలో ఉన్నారు. అలాగే ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు బిడెన్‌కు 39 శాతం ఓట్లు వచ్చాయి.

### మూడు నెలల్లోపే...

## భూముల క్రమబద్ధీకరణ




హైదరాబాద్: అనేక కుటుంబాలకు లబ్ధి చేకూర్చే లే అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ ఆర్ ఎస్) ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనల మేరకు భూముల క్రమబద్ధీకరణ జరగాలని, ఎలాంటి అక్రమాలకు తావివ్వకూడదని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూపాలపల్లి జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి జిల్లా కలెక్టర్ ఆఫీసు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. పరిష్కారం నోచుకోని దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ టీమ్ లను ఏర్పాటు చేయాలన్నారు.

### వాయనాడ్‌లో సకాలంలో వంతెన నిర్మించిన మహిళా సైనిక

## అధికారిణి బృందం

తిరువనంతపురం: మద్రాస్ ఇంజినీర్ గ్రూప్(ఎంఈజి) అండ్ సెంటర్, బెంగళూరుకు చెందిన మేజర్ సీతా అశోక్ షెల్కే (35) తన 144 మంది బృందంతో వాయనాడ్ లో రెండు రోజుల్లో బెయిలీ బ్రిడ్జి నిర్మించి ప్రశంసలు అందుకున్నారు. స్థానికులు, అధికారులు ఆమె టీమ్ కృషిని అభినందించారు. మేజర్ సీతా మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ కు చెందిన గడిల్గావ్ గ్రామానికి చెందినామె. ఆమె విలేకరులతో మాట్లాడుతూ వీలయినంత త్వరగా బ్రిడ్జి నిర్మించడంపైనే తాము దృష్టి పెట్టినట్టు తెలిపారు. " అనేక ఛాలెంజ్ లు ఎదుర్కొన్నాం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా మేము శిక్షణ పొందాము. స్థానిక అధికారులు, స్థానిక వాసులు మాకు ఎంతో సహాయ సహకారాలు అంధించారు. వాలంటీర్లు కూడా ఎంతగానో తోడ్పడ్డారు" అని తెలిపారు. మేజర్ సీతా ఇదివరలో జమ్మూకశ్మీర్ హైవే నం.1-ఏ నిర్మాణ పనుల్లో కూడా బాధ్యత తీసుకున్నారు.



# వాయనాడ్‌లో పర్యటించి పరిస్థితి తెలుసుకున్న నటుడు మోహన్ లాల్



వాయనాడ్: ఇండియన్ టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ కూడా అయిన మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ శనివారం కొండచరియలు విరిగిపడిన వాయనాడ్‌కు చేరుకున్నారు, అక్కడ ఐదవ రోజు విస్తృతమైన శోధన మరియు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. 2009లో టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ పదవిని పొందిన మోహన్‌లాల్, మెప్పాడిలోని శిబిరానికి చేరుకున్నప్పుడు తన ఆర్మీ యూనిఫాం ధరించి కనిపించారు. అధికారులతో చర్చించి ఆర్మీ వాహనంలో ఇతరులతో కలిసి కొండచరియలు విరిగిపడిన మండలానికి బయలుదేరారు. "మేము ఇప్పుడు ప్రభావిత ప్రాంతాలకు వెళ్తున్నాము" అని 64 ఏళ్ల నటుడు-నిర్మాత చెప్పారు. "విషాదం జరిగిన ప్రదేశానికి చేరుకున్న తర్వాతే తెలుస్తుంది, సహాయక చర్యల్లో సహాయం చేస్తున్న సైనికులు మరియు ఇతర వాలంటీర్లకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ ప్రాంతంలో పునరావాస కార్యక్రమాల కోసం మేము రూ. విరాళం ఇచ్చాము. 3 కోట్లు విరాళం ఇస్తున్నాం" అని మోహన్‌లాల్ తెలిపారు. అతను టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా కూడా పనిచేస్తున్నాడు. సైనికాధికారులతో చర్చించిన అనంతరం మోహన్‌లాల్ ముండక్కై, పుంఛిరిమట్టం ప్రాంతాల్లో పర్యటించారు. ఆ ప్రాంతాలు కొండచరియలు విరిగిపడ్డాయి. నటుడితోపాటు మేజర్ రవి కూడా వెళ్లాడు. మోహన్‌లాల్ 122వ ఇన్‌ఫాంట్రీ బెటాలియన్‌లో భాగం. కోజికోడ్ నుండి వాయనాడ్ వరకు ప్రయాణించారు. అలాగే సైనికాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

### ఉత్తమ్ కు లేఖ రాసిన హరీష్ రావు...

# ఆ రిజర్వాయర్లకు నీళ్లను విడుదల చేయాలి

హైదరాబాద్: సిద్దిపేట జిల్లాలోని అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్లు పూర్తిగా నీళ్లు లేక రిజర్వాయర్లు అడుగంటి పోయే పరిస్థితికి చేరుకున్నాయని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ తెలిపారు. నీళ్లు విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు లేఖ రాశారు. ఒకవైపు రిజర్వాయర్లలో నీళ్లు లేక మరోవైపు వర్షాలు కురవక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పంటలు వేయాలా వద్దా అనే అయోమయంతో రైతులు ఆవేదన చెందుతున్నారని తెలియజేశారు. గత సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే జిల్లాల పంటల సాగు విస్తీర్ణం కూడ తగ్గి పోయిందని, కాబట్టి రాజకీయాలు పక్కనబెట్టి మిడ్ మానెర్ నుండి అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ లకు నీటిని పంపింగ్ చేసేలా ఇరిగేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాలువల ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రైతాంగం పక్షాన హరీష్ రావు కోరారు.



# మరోసారి ఉరికించి కొట్టడం పక్కా...



**హైదరాబాద్:** నడిబొడ్డున తిరుగుతున్నా.. ఎక్కడికి రమ్మంటావో చెప్పు అంటూ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు సవాలు విసిరారు బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి . గతంలో లక్ష్మారెడ్డి, సుధీర్ రెడ్డి ఉప్పల్‌లో ఉరికించింది మరిచిపోయావా అని ప్రశ్నించారు. ఇదే విధంగా మాటలు జారితే మరోసారి ఉరికించి కొట్టడం ఖాయమన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శనివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శాసనసభలో దానం నాగేందర్‌కు ముఖ్యమంత్రి మైక్ ఇప్పించి తమను తిట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో దానం సంస్కారం లేకుండా మాట్లాడారని మండిపడ్డారు. నిరుద్యోగుల కోసం తాము కొట్లాడుతుంటే, ఆయన నీచమైన మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. దానం మాటలన్నీ నిరుద్యోగులను ఉద్దేశించినవేనని చెప్పారు. ఆ ఎమ్మెల్యే బెదిరింపులకు భయపడేవాళ్లు ఎవరూ లేరని స్పష్టం చేశారు. దానంకి ఎమ్మెల్యే పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని లిపారు. సిగ్గుంటే ఎమ్మెల్యే పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చింది మేమే...**

దేశంలో 2లక్షల 2 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది కేసీఆర్ మాత్రమేనని అన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఆయన తెలిపారు. తన సవాలుకు కాంగ్రెస్, బీజేపీ నోరు మెదపడం లేదని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిన 30వేల ఉద్యోగాలు కూడా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినట్లుగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. సిగ్గులేకుండా రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్‌పైనా మాట్లాడుతూ, జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగ ఖాళీల వివరాలు లేవని ఆయన అన్నారు. జాబ్ క్యాలెండర్‌పై ఎవరి సంతకం లేదని పేర్కొన్నారు. తేదీలు, ఉద్యోగ ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సీఎం, డిప్యూటీ సీఎం సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.

## తిరుమల అన్నదాన ట్రస్టుకు కోటి విరాళం...ఎవరిచ్చారంటే!

**తిరుమల:** తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి విచ్చేసిన సుమదుర సంస్థ చైర్మన్ గుండా మధుసూధన్, వైస్ చైర్మన్ కె వి రామారావు, డైరెక్టర్లు కందుకురి భరత్ కుమార్, గుండా నవీన్ కుమార్, మొురంచెట్టి శ్రీనివాన్... స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తిరుమల JEO వెంకయ్య చౌదరిని కలిసిన వారు వెంకటేశ్వర అన్నదాన ట్రస్ట్ కు కోటి రూపాయల విరాళమును అందించినారు.



# మిగులు ఆహారం ఉన్న దేశంగా ఇండియా: పిఎం మోడీ

న్యూఢిల్లీ: ప్రధాని మోడీ ఇండియా మిగులు ఆహారం ఉన్న దేశమని, ప్రపంచ ఆహార భద్రత, ప్రపంచ పోషకాహార భద్రత కోసం కృషి చేస్తున్న దేశం అని అన్నారు. ఢిల్లీలో వ్యవసాయ ఆర్థికవేత్తల 32వ అంతర్జాతీయ సదస్సును ఆయన నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశం రసాయన రహిత సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి, రైతుల జీవితాలను బాగుపరచడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. చిరుధాన్యాలు, పాలు, పప్పులు, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో భారత్ అగ్రదేశంగా ఉందన్నారు. దేశం వ్యవసాయ రంగంలో డిజిటల్ టెక్నాలజీని ఉపయోగిస్తుందన్నారు. కిసాన్ సమ్మాన్ కింద ఒక్క క్లిక్ తో పది కోట్ల రైతుల ఖాతాలోకి నిధులు జమా అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



### బిఆర్ఎస్ ఎంఎల్ఎలు టార్గెట్ చేశారు...

# క్షమాపణ చెబుతున్నా: దానం

హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో బిఆర్ఎస్ ఎంఎల్ఎలు కావాలనే తనని టార్గెట్ చేశారని ఎంఎల్ఎ దానం నాగేందర్ మండిపడ్డారు. ఎంఎల్ఎ క్వార్టర్స్‌లో ఖైరతాబాద్ ఎంఎల్ఎ దానం నాగేందర్ సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధిపై మాట్లాడేటప్పుడు ఆటంకం కలిగించారని, బిఆర్ఎస్ ఎంఎల్ఎలు మాట్లాడింది మైక్‌లో రికార్డు కాలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తనని కించపరిచే విధంగా మాట్లాడడంతోనే తాను సహనం కోల్పోయానని వ్యాఖ్యలు చేశానని వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలు ఎవరికైనా బాధను కలిగిస్తే క్షమాపణ చెబుతున్నానని, గత పది సంవత్సరాల నుంచి తనలాంటి వారికి అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని దానం మండిపడ్డారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎలు పద్ధతిని మార్చుకోవాలని హితువు పలికారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీలో హైదరాబాద్ నగర పరిస్థితిపై దానం నాగేందర్ మాట్లాడుతుండగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు గోల చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన దానం నాగేందర్ 'మీరు ఇలాగే ప్రవర్తిస్తే హైదరాబాద్‌లో తిరగనియ్యం కొడకల్లారా.. తోలు తీస్తా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటకాలు ఆడుతుతున్నారా? అంటూ ఆవేశంగా మాట్లాడిన విషయం విధితమే.



### ముదిరిన టిడిపి, వైసిపి

# డిష్యూం...డిష్యూం!

కర్నూల్: అస్పరి మండలం బిల్లెకల్ గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. కూరగాయల వేలం పాట నేపథ్యంలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పరస్పరం దాడులు చేసుకున్నారు. ఒకరిపై మరొకరు రాళ్లు రువ్వుకున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు వెళ్లిన ఆస్పరి సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతప్పపై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన తలకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. గతంలో వైసిపి కాంట్రాక్టర్ నల్లన్న రూ. 78 లక్షలకు వేలం పాటలో బిల్లేకల్ కూరగాయాల మార్కెట్ దక్కించుకున్నారు. వీరేశ్ అనే రైతు మిరప పంటను విక్రయించేందుకు మార్కెట్ కు వచ్చాడు. వేలం పాట తర్వాత డబ్బులు చెల్లించారు. కాగా డబ్బుల విషయంలో కాంట్రాక్టర్ నల్లన్న, మార్కెట్ నిర్వాహకుడు హనుమంత రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించారని రైతు వీరేశ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. వేలం పాటను నిలిపేయాలని డిమాండ్ చేశాడు. దాంతో మార్కెట్ నిర్వాహకుడు హనుమంత రెడ్డి, రైతు వీరేశ్ లకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలియడంతో వైసిపి కన్వీనర్, టిడిపి మండల మాజీ కన్వీనర్ మార్కెట్ కు చేరుకున్నారు. దాంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. మార్కెట్ అంతా ఉద్రిక్తంగా ఉంది. ఇంకా వివరాలు అందాల్సి ఉంది.



# ఆ బాలికకు చంద్రబాబు ఆపన్న హస్తం

**అమరావతి:** నంద్యాల జిల్లా, చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో అర్థరాత్రి సమయంలో మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని అన్నారు. ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబంపై అర్థరాత్రి మట్టి మిద్దె కూలడంతో వంగలి గ్రామానికి చెందిన తల్లపురెడ్డి గురుశేఖర్ తో పాటు ఆయన భార్య, ఇద్దరు పిల్లలు చనిపోయారు. వర్షాలకు నాని మిద్దె కూలిపోయింది. దీంతో నిద్రలోనే గురుశేఖర్ తో పాటు భార్య దస్తగిరమ్మ, కుమార్తెలు పవిత్ర, గురులక్ష్మి ప్రాణాలు కోల్పోయారు. రెండో కుమార్తె తల్లపురెడ్డి గురు ప్రసన్న(15) ప్రొద్దుటూరులో 10వ తరగతి చదువుకుంటోంది. రాత్రికి రాత్రి కుటుంబంలో తల్లిదండ్రులతో సహా తోబుట్టువులు చనిపోవడంతో ప్రసన్న అనాథ అయ్యింది. ఈ ఘటనపై సమాచారం తెప్పించుకున్న ముఖ్యమంత్రి ప్రసన్నకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం తరుపున రూ.10 లక్షల సాయం ప్రకటించారు. ప్రస్తుతం ప్రసన్న తన నాయనమ్మ తల్లపురెడ్డి నాగమ్మ(70) సంరక్షణలో ఉందని అధికారులు వివరించారు. ప్రసన్న పేరుతో రూ.10 లక్షలు డిపాజిట్ చేయడంతో పాటు... వృద్ధురాలైన నాగమ్మకు కూడా రూ.2 లక్ష సాయం అందించాలని సీఎం అధికారులను అదేశించారు.



జిల్లా అధికారులు ఆ బాలికను కలిసి ధైర్యం చెప్పాలని సూచించారు. చిన్న వయసులో తల్లిదండ్రులను, తోబుట్టువులను కోల్పోయిన ఆ బాలికకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. మరోవైపు పార్టీ పరంగా కూడా ప్రసన్నకు బాసటగా నిలుస్తామని సీఎం అన్నారు.

## సంపాదకీయం

ఆదివారం, ఆగస్టు 4, 2024

# వర్గీకరణ తీర్పు... నెక్స్ట్ ఏంటీ

ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించే అదికారం రాష్ట్రాలకు ఉందా అనే అంశంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు చెప్పింది. దీనిపై 23 పిటిషన్లు దాఖలు కాగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో సీజేఐ నేతృత్వంలో రాజ్యాంగ ధర్మాసనం మూడు రోజులు సుదీర్ఘ వాదనలు విన్నది. విచారణ పూర్తి చేసింది ఎట్టకేలకు తీర్పు వెలువరించింది. వర్గీకరణ అంశం చాలా ఏళ్లుగా డిమాండ్ ఉంది.. న్యాయస్థానంలోనూ పెండింగ్‌లో ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ కోసం సుధీర్ఘ పోరాటమే జరుగుతోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణలో ఏర్పాటు చేసిన సభలో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ఈమేరకు సుప్రీకోర్టుకు కేంద్రం తరఫున విన్నవిస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను న్యాయమైన డిమాండ్‌గా పేర్కొన్నారు. దీంతో ఎన్నికల్లో మాదిగ సామాజికవర్గం మద్దతు బీజేపీకే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. అసెంబ్లీతోపాటు, లోక్‌సభ ఎన్నికల్లోనూ మాదిగలు బీజేపీకి అనుకూలంగా ఓటువేశారు. హైదరాబాద్ సభలో చెప్పినట్లుగానే మోదీ వర్గీకరణపై నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తాజాగా సుప్రీం కోర్టు కూడా వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం గమనార్హం. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తరగతుల్లో (ఎస్టీ) వర్గీకరణ అంశంపై ఏడుగురు సభ్యుల సుప్రీం కోర్టు ధర్మాసనం సుదీర్ఘ విచారణ తర్వాత సంచలనమైన తీర్పు వెల్లడించింది. 6?1 తేడాతో వర్గీకరణను సమర్ధించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వాదనలు పూర్తి చేసిన ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. తాజాగా గురువారం తీర్పు వెల్లడించింది. వర్గీకరణ సమంజసమేనని స్పష్టం చేసింది. అయితే, ధర్మాసనంలోని జస్టిస్ బేలా త్రివేది మాత్రం వర్గీకరణకు వ్యతిరేకంగా తీర్పు రాశారు. ఉప?వర్గీకరణ సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉంటే.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉందని సీజేఐ జస్టిస్ డీవై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవిందర్ సింగ్ కేసులో తొలుత ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారణ చేపట్టింది. 2020లో దీనిని విస్తృత ధర్మాసనానికి నివేదించింది. వర్గీకరణ అనుమతించదగినది కాదని ఈవీ చిన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో కో?ఆర్డినేట్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫిబ్రవరిలో మూడు రోజులు వరుసగా విచారణ పూర్తిచేసి.. తీర్పు వాయిదా వేసింది. ఇక తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమిస్తోంది. రెండు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలు ఉన్నాయి. వీటిలో మాల, మాదిగ ప్రధానమైనవి. ఎస్సీల్లో మాల సామాజికవర్గానికి చెందినవాళ్లు సామాజికంగా, విద్యాపరంగా ముందజంలో ఉన్నారు. వారి జనాభా మాదిగలతో పోలిస్తే, చాలా తక్కువ. అయినా ఎస్సీ రిజర్వేషన్లన్నీ వారే అనుభవిస్తున్నారంటూ మాదిగ, దాని ఉప కులాలు ఆరోపిస్తున్నాయి. ఎస్సీ రిజర్వేషన్లపై అధ్యయనం కోసం 1965లో లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వం లోకూర్ కమిషన్‌ను నియమించింది. కమిషన్ నివేదిక మాదిగలు అన్యాయానికి గురవుతున్నట్టు తెలిపింది. 1996 సంవత్సంలో ఎస్సీ వర్గీకరణ కోసం మందకష్ణ మాదిగ నేతృత్వంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమాలు ప్రారంభించింది. దీంతో నాటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం జస్టిస్ రామచంద్ర రాజు కమిషన్ వేసింది. ఈ కమిషన్ నివేదిక ప్రకారం.. 2002లో నాటి ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించింది. మొత్తం 15 శాతంలో మాదిగ దాని ఉప కులాలకు 7 శాతం, మాల, దాని ఉప కులాలకు 6 శాతం, ఇతర కులాలకు 2 శాతం వర్గీకరించి అమలు చేసింది. అయితే ఎస్సీ వర్గీకరణ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ రిజర్వేషన్లు కాస్తా రద్దయ్యాయి. 2008 లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వర్గీకరణపై అధ్యయనం చేయడానికి ఉషా మెహ్రా కమిషన్ వేసింది. ఆ కమిషన్ నివేదిక ప్రకారం కూడా ఎస్సీల్లో మాదిగలు వెనుకబడి ఉన్నారని తేల్చింది. . విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని పేర్కొన్న చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం దీనివల్ల ఎస్సీ ఎస్టీలోని వెనుకబడిన కులాలకు లబ్ధి చేకూరుతుందని అభిప్రాయపడింది. కాగా.. సుప్రీంకోర్టు తీర్పుతో మంద కృష్ణమాదిగ భావోద్వేగానికి గురయ్యారు.. మీడియా ఎదుట కంటనీరు పెట్టుకున్న మంద కృష్ణ.. తమ 30 ఏళ్ల పోరాటానికి న్యాయం జరిగిందంటూ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పు న్యాయాన్ని బతికించిందంటూ పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ వర్గీకరణ ప్రక్రియ వేగవంతానికి ప్రధాని మోదీ చొరవ తీసుకున్నారని మందకృష్ణ పేర్కొన్నారు. అమిత్‌షా, వెంకయ్యనాయుడు, కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణ చేసేలా చూసిన చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలంటూ పేర్కొన్నారు. ఈ విజయాన్ని అమరులకు అంకితం ఇస్తున్నామని.. రిజర్వేషన్ల సిస్టమ్ ఇప్పుడు రెండో అడుగు వేయబోతుందని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ అనివార్యమని పేర్కొన్న మందకృష్ణ.. వర్గీకరణకు సంబంధించిన జీవోలు వచ్చిన తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమడ్ చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు సరిచేసుకోవాల్సిన అవసరం ఉందని.. రీనోటిఫికేషన్లు ఇవ్వాలని మందకృష్ణ మాదిగ కోరారు.. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహిస్తామని.. తమకు సహకరించినవారి కోసం అభినందన సభ ఏర్పాటు చేస్తామంటూ మందకృష్ణ కోరారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేయడానికి వర్గీకరణ ఒక్కటే మార్గమని సూచించింది. దీనికి పార్లమెంట్‌లో చట్టం తేవడం ఒక్కటే మార్గం అని సూచించింది. ఎట్టకేలకు సుప్రీ కోర్టే ఎస్సీ, ఎస్టీల వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువరించింది.

# రాజన్న ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ వేములవాడ:** వేములవాడ పట్టణంలో శనివారం ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంతో పాటు రాజన్న ఆలయ అభివృద్ధిపై చిత్తశుద్ధితో ఉన్నామని తెలిపారు. బీజేపీ, బి.ఆర్.ఎస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేయడం సిగ్గుచేటని, 10ఏండ్లు అధికారంలో ఉండి రాజన్న ఆలయానికి అణా పైసా కేటాయించని అసమర్ధ పార్టీ బి.ఆర్.ఎస్ అని మండిపడ్డారు. 10ఏండ్లు కేంద్రంలో అధికారంలో ఉండి రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీమ్ లో చేర్చని పార్టీ బీజేపీ అని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాజన్న ఆలయానికి రాజన్న ఆలయ అభివృద్ధికి రూ. 50కోట్ల నిధులు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. ఎమ్మెల్యే పదవిని కేవలం హోదాకు



చిహ్నంగా వాడుకొని వేములవాడ ప్రజలను మోసం చేసిన నాయకుడు, పరాయి దేశ పాలకుడు నేడు చిలకపలుకులు పలుకుతున్నాడన్నారు. 155 కోట్ల నిధులు ఏవి అంటున్న ఆ నాయకుడు మరి ఆనాడు వారి ప్రభుత్వ హయాంలో నిధులు ఎందుకు తేలేదో చెప్పాలన్నారు. కేవలం ఎన్నికల్లో లబ్ది కొరకే 155కోట్ల అభివృద్ధి నిధులు తెస్తున్నట్లు ప్రజలను నమ్మించి, మసి బూసి మారేడు కాయ చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. కేవలం ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నియోజకవర్గ ప్రజలను మోసం చేసే క్రమంలో లేని, రాని నిధులను వచ్చినట్లు చూపించారు. మళ్ళీ ఇప్పుడు ఏవి అని అడుగుతున్నారంటే ఆనాడు వారు చూపించింది చిత్తు కాగితాలు అన్నట్లే కదా, టికెట్ ఇవ్వలేరు అంటేనే తిరస్కరించినట్లు కదా మళ్ళీ ఉనికి కోసం తప్పుడు ఆరోపణలు చేయడం ఎందుకని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలను అగౌరవపరిచినట్లు చిత్రీకరిస్తున్నారని అసలు మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చే వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నది నిజం కాదా,కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు సిద్ధమవుతున్నది వాస్తవం కాదా చెప్పాలన్నారు. ఎల్లంపల్లి పేజ్-1, పేజ్-2 తో నియోజకవర్గంలో సాగునీరు అందించేందుకు రూ. 320 కోట్లు, కెనాల్ నెట్ వర్క్ కొరకు బడ్జెట్ లో నిధులు కేటాయించడం జరిగిందని, మిడ్ మానేరు నిర్వాసితులు, చేనేత కార్మికులను అదుకునేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని రుణమాఫీ వంటి సహోసోపేత నిర్ణయం తీసుకున్న మాట వాస్తవం కాదా అని అన్నారు సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాదిగల ఆత్మగౌరవం కాపాడేలా దేశంలోనే పేరుగాంచిన అడ్వకేట్లను పెట్టి ఎస్సి, ఎస్టీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని మేనిఫెస్టోలో చెప్పిన విధంగా జాబ్ క్యాలెండర్ ను విడుదల చేసామని, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సీఎం మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ల సహకారంతో నియోజకవర్గాన్ని, రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఇప్పటికయినా బీజేపీ, బి.ఆర్.ఎస్ నాయకులు ఇప్పటికైనా తమపై అసత్యపు ఆరోపణలు మానుకోని అభివృద్ధి కి కలిసిరవాలని కోరారు. చివరిగా ప్రజలను ఒక్కటే కోరుతున్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గమనించండి, ప్రతిపక్ష పార్టీల నాయకుల మోసపూరిత మాటలను, వారి కపట ప్రేమను నమ్మి మోసపోకండి అని కోరారు.

# కాంగ్రెస్ పాలనలో నేతన్నల ఆకలిచావులు, ఆత్మహత్యలు

## - చనిపోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

## - మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** కాంగ్రెస్ పాలనలో నేతన్నల ఆకలి చావులు, ఆత్మహత్యలు మొదలయ్యాయని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. రామడుగు మండలం షా నగర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి రమేష్ ఉపాధి లేక కూలి పని కూడా దొరకక ఇటీవల మృతి చెందగా శనివారం మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమేష్ కుటుంబానికి రెండు లక్షల ఎక్స్గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. అలాగే నేత కార్మికులకు నిరంతరంగా ఉపాధి పనిని కల్పించాలని కోరారు. అప్పుల్లో కూరుకుపోయిన వస్త్ర పరిశ్రమ పవర్లూమ్ పరిశ్రమను ఆదుకోవాలని అన్నారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నేతన్నలకు బతుకమ్మ చీరలను,స్కూల్ యూనిఫామ్స్ ని పిచ్చి వారి జీవితాలలో వెలుగు నింపామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విధావిధిగా నేతన్నలకు ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు. నాటి పదేళ్ల కింద ఉన్నటువంటి కాంగ్రెస్ పాలనలో ఎలాంటి చావులు చూశాము మళ్లీ ఇప్పుడు అవే రోజులు మొదలయ్యాయని అన్నారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, మాజీ ఎంపీపీ తౌటు మురళి, సీనియర్ నాయకులు కలిగెటి లక్ష్మణ్, గడ్డం మోహన్ రావు, సైన్ల కర్ణాకర్, సత్యరాజ్ వర్మ, రాజు,అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛదనం- పచ్చదనంపై సమీక్ష సమావేశం





**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** రాష్ట్ర ప్రభుత్వం పల్లెలు పచ్చదనంతో, స్వచ్ఛతనంతో ఉండాలని ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛతనం పచ్చదనం అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా శనివారం రామడుగు మండలం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామడుగు మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాష్ కిరణ్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో ఆగస్టు 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు రోజుకు ఒక కార్యక్రమం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమం మొదటి రోజు స్థానిక నాయకులు, యువజన, మహిళా సంఘాల సభ్యులతో ప్రణాళిక రూపొందించాలనీ, రెండవ రోజు త్రాగునీరు వర్షపు నీటిని సంరక్షించాలని, మూడవరోజు మురికి కాలువలు, నీరు నిల్వ ప్రదేశాలు గుంతలు పూడ్చడం, నాలుగవ రోజు ప్రజా ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం, చివరి రోజు అయిన ఐదవరోజు ప్రభుత్వ సంస్థలను, ప్రజా స్థలాల పరిశుభ్రత లాంటి కార్యక్రమాలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇట్టి కార్యక్రమాలలో ఎటువంటి లోటుపాట్లు జరగకుండా గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో రాజేశ్వరి, గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్‌కు సన్మానం



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం:** కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ లింగంపల్లి శ్రీకాంత్ కు శనివారం గన్నేరువరం మండల కేంద్రం లో మానకొండూరు నియోజకవర్గ దళిత సంఘ నాయకులు లింగంపెల్లి శ్రీకాంత్ కి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుల వెంకటి,ఎల్కపల్లి సంపత్, సముద్రాల లక్ష్మణ్, మాతంగి అనిల్,కొంపల్లి రాజు,అలువాల కోటి, జనగామ శంకర్, మాణాల రవి,చింతకింది పర్శరాములు మంకలి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం:** మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు తల్లులకు అవగాహన సమవేశం శనివారం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి మండల స్పెషల్ ఆఫీసర్ రామానుజాచార్య మాట్లాడుతూ తల్లి పాలు కల్తీ లేనివి అన్ని రకాల పోషకాలు ఉంటాయని వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని తల్లులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పిల్లలకు అన్నప్రసన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎం పి ఓ శ్రీనివాస్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి కారోబార్ మాధవరావు అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్ తల్లులు పాల్గొన్నారు.

# లక్కీడ్రాలో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేసిన ఏఎస్పి




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, వేములవాడ:** ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఏ ఎస్ పి శేషాద్రిని రెడ్డి అన్నారు. వేములవాడ డిపో ఆధ్వర్యంలో డీలక్స్ బస్సులలో ప్రయాణం చేసే మహిళలకు గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టగా, లక్కీ డ్రా ద్వారా పేర్లు తీసి, మహిళ ప్రయాణికులకు బహుమతులను శనివారం ఏఎస్పి శేషాద్రిని రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మి స్కీం వర్తించని బస్సులలో ప్రయాణించే ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం వర్తిస్తుందని దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్ తో పాటు ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

# పరమ పవిత్ర స్నేహబంధం....!




త్యాగానికి నిలువెత్తు నిదర్శనం స్నేహం. అవధులు లేని స్నేహాన్ని ఆస్వాదించడం ఓ నేర్పు. మనసులో మాటను, సుఖదుఃఖాలను పంచుకోవడానికి, మనసును తేలిక పరుచుకోవడానికి ఓ అద్భుత నేస్తం కావాలి. అమ్మ రొమ్ము పాల వలె స్నేహ హస్తం కూడా స్వచ్ఛమైంది, పవిత్రమైందని మనకు తెలుసు. స్నేహితులు లేని వారు ఎక్కడా ఉండరు. ప్రాణమిత్రులను కలిగి ఉండడం ఓ అదృష్టం. అదో దేవుడిచ్చిన అపురూప వరం. స్నేహబంధానికి కులమతాల విబేధాలు లేవు, ఆర్థిక అంతరాలు ఉండవు. ఆగష్టు మాసంలో తొలి ఆదివారం, అనగా 04 ఆగష్టు 2024న భారతదేశవ్యాప్తంగా 'జాతీయ స్నేహ దినం (నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే)'గా పాటించడం ఆనవాయితీగా మారింది. కొన్ని దేశాల్లో 30 జూలై రోజున కూడా అంతర్జాతీయ స్నేహ దినం నిర్వహించబడుతున్నది. స్నేహ బంధాన్ని గుర్తు చేసుకోవడం, ప్రాణమిత్రులను కలుసుకోవడం, ఉల్లాసంగా ప్రకృతిలో మిత్రులతో గడపడం, కలిసి భోజనాలు చేయడం, స్నేహితునికి కృతజ్ఞతలు తెలపడానికి వేదికగా ప్రతి ఏటా ఆగష్టు మొదటి ఆదివారం, అనగా 04 ఆగష్టు 2024న జాతీయ స్నేహ దినాన్ని భారత దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాం.

# మార్కెట్ పీఠం ఎవరికి దక్కేనో.....?

**- ఆశావహుల ఎదురుచూపులు......**
**- ఎమ్మెల్యే వద్ద ఆశావాహుల లిస్టు.....?**
**- చైర్మన్ పీఠం ఎవరికి వరించనుంది.......?**
**- త్వరలోనే ఉత్కంఠకు తెర.....!**




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, చొప్పదండి:** ఆదాయం సమకూర్చే మార్కెట్ కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం పాలకవర్గాలను నియమిస్తోంది. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించిన మార్కెట్ కమిటీ పాలకవర్గాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దుచేసింది. చొప్పదండి నియోజకవర్గంలోని చొప్పదండి, రామడుగు మండలం గోపాల్రావుపేట, గంగాధర, మల్యాల, బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ పదవులకు ఆశావహులు అధిక సంఖ్యలో పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఈ పోస్టుల భర్తీపై దృష్టిసారించి ఆశావహుల మధ్య సయోధ్య కుదిర్చి కొద్ది రోజుల క్రితం చొప్పదండి మార్కెట్ పాలకవర్గాన్ని నియమించారు. చొప్పదండి మార్కెట్కు పాలకవర్గాన్ని నియమించడంతో గంగాధర, రామడుగు మండలాల నాయకుల్లో ఆశలు రేకెత్తాయి. గంగాధర, గోపాల్రావుపేట వ్యవసాయ మార్కెట్లు 2001కు ముందు చొప్పదండి మార్కెట్ కమిటీ పరిధిలో సబ్ మార్కెట్ యార్డులుగా ఉండేవి. 2001లో గంగాధర, 2018లో గోపాల్రావుపేట సబ్ మార్కెట్ యార్డును మార్కెట్ కమిటీలుగా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.




**- గత ప్రభుత్వం నుంచి రిజర్వేషన్ అమలు**

టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటి సారిగా మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను ఖరారు చేసింది. మార్కెట్ యార్డు పదవీకాలాన్ని రెండేళ్ల నుంచి ఏడాదికి కుదించింది. గంగాధర వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవి బీసీ మహిళకు, గోపాల్రావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు చేయడంతో అప్పటి ఎమ్మెల్యే బొడిగె శోభకు అత్యంత సన్నిహితంగా ఉన్న రేండ్ల పద్మ, పూడూరి మణెమ్మను చైర్పర్సన్లుగా నియమించారు. ఆ తర్వాత 2019లో ఈ రెండు మార్కెట్ కమిటీలను జనరల్కు కేటాయించడంతో ఎక్కువ మంది ఆశావహులు పోటీపడ్డారు. అప్పటి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలంగాణ ఉద్యమంలో పోరాడిన సాగి మహిపాల్రావు, గంట్ల వెంకట్రెడ్డిని ఏఎంసీ చైర్మన్లుగా నియమించారు. 2023లో గంగాధర ఏఎంసీ ఎస్టీలకు, గోపాల్రావుపేట ఏఎంసీ బీసీ జనరల్కు కేటాయించడంతో గంగాధరలో లోకిని ఎల్లయ్య, గోపాల్రావుపేటలో మామిడి తిరుపతిని నియమించారు. వీరి పదవీకాలం పూర్తికాకముందే బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవులను రద్దుచేసింది.

**- పోటీ పడుతున్న ఆశావహులు**

కాంగ్రెస్ పార్టీ గతేడాది డిసెంబర్లో అధికారంలోకి రాగానే నామినేటెడ్ పదవులను రద్దుచేసింది. ఈ పదవులను భర్తీ చేసే సమయంలో ఎంపీ ఎన్నికలు రావడంతో కొద్దిరోజులు ఆగింది. దీంతో పాలకవర్గం లేకుండానే మార్కెట్లలో రబీ కొనుగోళ్లు జరిగాయి. ప్రస్తుతం ఖరీఫ్ మొదలైంది. దసరాకు వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్కు వస్తాయి. అధికారులతో పాటు పాలకవర్గం ఉంటే రైతులకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం పాలకవర్గాలను భర్తీ చేసే పనిలో పడింది. రాష్ట్రంలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గంగాధర, గోపాల్రావుపేట మార్కెట్కమిటీలకు డైరెక్టర్లుగా, చైర్మన్గా పనిచేయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. తనకంటే తనకు అవకాశం ఇవ్వాలని ఆశావహులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. మార్కెట్ చైర్మన్ పదవులు జనరల్ మహిళలకు రిజర్వ్వవడం వల్ల బీసీ, ఓసీ నాయకులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు.

**- ఆపత్కాలంలో పార్టీ కోసం పనిచేసిన వారికే..!**

గంగాధర, రామడుగు మండలాల్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లుగా కష్టకాలంలో పార్టీ అభివృద్ధికి పనిచేసిన వారినే వరించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు పాలకవర్గ సభ్యుల పేర్లతో కూడిన జాబితా ఎమ్మెల్యే వద్ద ఉన్నట్లు సమాచారం. గంగాధర ఏఎంసీ చైర్మన్ పదవికోసం బీసీ మున్నూరుకాపు, రెడ్డి సామాజిక వర్గం, రామడుగు మండలం గోపాల్రావుపేట ఏఎంసీ చైర్మన్ పదవికోసం రెడ్డి సామాజికవర్గం, బీసీ ముదిరాజ్ సామాజికవర్గానికి చెందినవారు పోటీపడుతున్నారు. గంగాధరలో రెడ్డి సామాజికవర్గానికి కేటాయిస్తే గోపాల్రావుపేటను బీసీ సామాజికవర్గానికి, గంగాధరలో బీసీ సామాజికవర్గానికి కేటాయిస్తే గోపాల్రావుపేటను రెడ్డి సామాజికవర్గానికి కేటాయిస్తారని నాయకులు అంటున్నారు. ఏదేమైనా వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్కు రాకముందే ఈ రెండు మార్కెట్ యార్డులకు పాలకవర్గాలను నియమించాలని నాయకులు, రైతులు కోరుతున్నారు.మరి ఈ పీఠం ఎవరికి దక్కనుందో వేచి చూడాల్సిందే మరి......?

# అనంతగిరి ఆర్ ఆర్ కాలనీ కష్టాలు తీరేది ఎన్నడు

- నిర్వాసితులకు న్యాయం జరిగేది ఎప్పుడు
- కోట్లాది రూపాయల పరిహారం డబ్బులు ఎటు పోయాయి..!
- ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయాం... అయిన పట్టించు కునే నాథుడే లేదు





**తెలంగాణా క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** అనంతగిరి ఆర్ అండ్ ఆర్ కాలనీ నుండి ఇల్లంతకుంట వెళ్ళుటకు రహదారి నిర్మించిన రోడ్డుకు ఆర్ అండ్ ఆర్ కాలనీ మధ్యలో పోచమ్మ కుంట నుండి నీరు పోవుటకు కాలువ తవ్వి కాలువపై వంతెన నిర్మాణం చేస్తామని దాదాపు నాలుగు సంవత్సరాలుగా ఇగోవచ్చే అగోవచ్చే అన్నచందగా నాయకుల మాట మారిందే తప్ప నిర్వాసితుల కష్టాలు తీరలేదు ప్రభుత్వం నిర్మించవలసి గ్రామ పంచాయతీ నిర్మాణం కార్యాలయం, సెంట్రల్ లైట్ ,ప్రభుత్వ పాఠశాల, పిల్లర్ల వద్దే ఆగిపోయిన దవాఖాన, ఫంక్షన్ హాల్, క్రీడా మైదానం మహిళా సంఘభవనాలు, కులసంఘాలకు అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని చెప్పి రంగుల ప్రపంచాన్ని చూపించారు ఇగ ప్లాట్ల విషయానికి వస్తే కొన్ని ప్లాట్లు అధికారం పేరుతో వారి కబ్జాల్లో ఉంచుకుని కొన్ని ప్రభుత్వ భూములు కూడా వారి పేర్లమీద మార్పించుకున్నటుగా వినికిడి ఆర్ అండ్ ఆర్ ప్లాట్లకు హద్దులు లేవు ప్రాజెక్టు కు హద్దులు లేవు డబ్బులు తీసుకున్న భూములు సైతం కబ్జాలు కావడం కొసరుపు ఇప్పటి అనంతగిరి ఆర్ అండ్ ఆర్ కాలనీ లేఔట్ మ్యాప్ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది కమిషన్ కోసమేనా ప్రాజెక్ట్ లు అన్న చందాగా మారిందని అధికారులు నాయకులు ఇట్టివిషయాలలో విఫలం అయినరాని ఇప్పటికైనా పెద్దలింగాపూర్ అనంతగిరి డబుల్ రోడ్డు మరియు ఇల్లంతకుంట అనంతగిరి మధ్యలో కాలువపై బ్రిడ్జి నిర్మాణం పనులుమరియు మిగిలిపోయిన డ్రైనేజీ నిర్మాణం లింక్లను పనులను సకాలంలో పూర్తి చేసి కనీస ప్రభుత్వ బాధ్యత గుర్తించి ప్రజలకు సరైన రవాణా కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అలాగే అంకుసాపూర్ లో మరియు అనంతగిరి లో ఆర్ అండ్ ఆర్ కాలనీ కొరకు కేటాయించిన కొందరికి పలు సంఖ్యలో ప్లాట్లు ఉన్నట్టు గా మరియు నిర్వసితుల కు కాకుండా ఇతరులకు సైతం ప్లాట్లు ఉన్నట్టుగా అమ్మకాలు కొనుగోలు జరిగాయాని అధికారులు చేతి వాటం ప్రదర్శించాలని వాటి పైకూడా విచారణ జరిపించి అన్యాక్రాంతం అయినా ప్లాట్లను స్వాదినం చేసుకొని నిర్వసితులకు న్యాయం చేయాలని కోరుకుంటున్నారు.

# ఇప్పుడు కాకపోతే... మరెప్పుడు...పదవులపై రాని క్లారిటీ

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు 9 నెలలు కావస్తోంది. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీలో పదవుల కోసం చాలా మంది నాయకులు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. అందుకే నామినేటెడ్ పోస్టులను కూడా ఎన్నడూ లేనట్లు వేగంగా భర్తీ చేసింది సీఎం రేవంత్ రెడ్డి సర్కార్. ఐతే? కొన్ని విషయాల్లో స్పీడుగా నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వం? ముఖ్యమైన అంశాలపై ఎడతెగని జాప్యం చేస్తోందని కాంగ్రెస్ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రమంత్రి మండలిలో 18 మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం సీఎంతోసహా 12 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా ఆరుగురికి చాన్స్ ఉన్నా? మంత్రివర్గాన్ని విస్తరించకుండా పెండింగ్లో పెట్టారు. ఇక మంత్రి మండలి విస్తరణనే కారణంగా చూపి పీసీసీ చీఫ్ను నియమించలేదు. మరోవైపు అసెంబ్లీలో కీలకమైన డిప్యూటీ స్పీకర్, చీఫ్ పదవులను కూడా భర్తీ చేయకపోవడంతో విలువైన సమయం కోల్పోతున్నామని సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పదేళ్ల తర్వాత ఎంతో కష్టపడి అధికారం సాధిస్తే? అధిష్టానం జాప్యం చేయడం వల్ల ఆ అధికారాన్ని అనుభవించలేకపోతున్నామని ఎక్కువ మంది నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ లేకుండానే రెండు అసెంబ్లీ సెషన్లు ముగియడం కూడా వారి అసంతృప్తికి కారణమవుతోంది. ఈ రెండు పదవులపై చాలా మంది ఎమ్మెల్యేలు ఆశలు పెట్టుకున్నారు. ఐతే సీఎం రేవంత్రెడ్డి కానీ, పార్టీ హైకమాండ్ కానీ ఈ విషయంపై దృష్టి పెట్టినట్లు కనిపించడం లేదని వాపోతున్నారు ఆశావహులు. ఈ రెండు పోస్టులను మంత్రి మండలి విస్తరణకు లింకు చేసి పెండింగ్లో పెట్టడం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు సీనియర్ నేతలు.ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణలో ఆరుగురికి అవకాశం ఉంది. కానీ ఆశావహులు మాత్రం డజను మంది ఉన్నారు.

# పాపం...గడల...కథ అడ్డం తిరిగింది




**ఖమ్మం :** గడల శ్రీనివాస్.. కరోనా సమయంలో బాగా వినిపించిన పేరు.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళ్లు మొక్కి వార్తల్లో నిలిచిన అధికారి. ఆయనే మాజీ తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ రావు. ఆయన రాజకీయ ఆశలు ఆవిరయ్యాయి. హెల్త్ డైరెక్టర్గా ఉన్నత స్థాయి ఉద్యోగంలో ఉండి, కేసీఆర్కు పరమభక్తుడిగా, రాజకీయ నేతలా అతిగా రాజకీయ జోక్యం చేసుకున్నాడు. కొత్తగూడెం ఎమ్మెల్యే టికెట్ తనకే వస్తుందని హడావుడి చేశారు. చివరికి టికెట్ రాలేదు. ఆ తర్వాత ఎంపీ టికెట్ పై కర్చీఫ్ వేసినా, ఫలితం దక్కలేదు. సీన్ కట్ చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో తన ఉద్యోగంలో కష్టాలు మొదలయ్యాయి. రాష్ట్ర స్థాయి అధికారి నుంచి మహబూబాద్ అడిషనల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ గా ట్రాన్స్ఫర్ చేసింది కొత్త సర్కార్. అంతన్నాడు.. ఇంతన్నాడు.. చివరికి ఇలా అయ్యాడు..!బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్గా పని చేసిన గడల శ్రీనివాస్ రావు.. ఒక వెలుగు వెలిగారు. ఉన్నత అధికారి అనే కంటే అప్పటి సీఎం కేసీఆర్కు పరమ విధేయుడిగా డ్రామాలు ఆడారు. ఉన్నతాధికారిగా ఉండి కూడా రాజకీయ నేతలా ఈయన గారి హడావుడి మాములుగా ఉండేదీ కాదు..! టైం దొరికితే చాలు, ఆదివారం వచ్చిందంటే కొత్తగూడెంలో వాలిపోయేవారు. జిఎస్ఆర్ ట్రస్టు పేరుతో కొత్తగూడెంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశాలు, సభలు, ర్యాలీలతో హోరెత్తించారు. అవసరం లేకున్నా కేసీఆర్ ను అతిగా పొగడటం.. ఓసారి ఏకంగా ఆయన కాళ్ల మీద పడ్డారు. ఇది అప్పట్లో పెద్ద చర్చకు దారి తీసింది. అయినా కేసీఆర్ కాళ్ళపై పడటాన్ని ఈయనగారు గట్టిగానే సమర్థించుకున్నారు.అవకాశం వస్తే.. కొత్తగూడెం ప్రజలకు సేవ చేసుకుని, పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటానని.. రాజకీయ నేతలాగా సభలు నిర్వహించి ఉపన్యాసాలు ఇచ్చేవారు. బీఆర్ఎస్ తరఫున కొత్తగూడెం ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. తాను ఉన్నత స్థాయి అధికారి అనే విషయాన్ని మర్చిపోయారు. రాజకీయ కార్యకలాపాలు, ఒక పార్టీకి అనుకూలంగా నిర్వహించి, మాట్లాడే వారు. అప్పట్లో గడల తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. చివరికి ఎన్ని ప్రయత్నాలు చేసినా.. కేసీఆర్ హ్యాండ్ ఇచ్చాడు. సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు కొత్తగూడెం టికెట్ ఇవ్వడంతో ఎమ్మెల్యే టికెట్ ఆశలు ఆవిరయ్యాయి. దీంతో అసెంబ్లీ ఎన్నికల సమయంలో అడ్రస్ లేకుండా పోయారు. దీంతో కొత్తగూడెం వైపే కన్నెత్తి చూడలేదు.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో..వెంటనే పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి. వెంటనే ప్లేట్ మార్చి, గాంధీ భవన్ లో కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీ టికెట్ కూడా రాలేదు. దీంతో గడల రాజకీయ ఆశలు పూర్తిగా ఆవిరి అయ్యాయి. ఇపుడు అతని ఉద్యోగంలోనూ కష్టాలు మొదలయ్యాయి. మహబూబాబాద్ అడిషనల్ డిస్ట్రిక్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ గా ట్రాన్స్ఫర్ చేసింది కొత్త సర్కార్. ఈ మేరకు జూలై 27న ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే గడల శ్రీనివాస్ ప్రస్తుతం లాంగ్ లీవ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన ఇప్పటికే రెండుసార్లు వీఆర్ఎస్కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆయన తిరిగి ఉద్యోగంలో చేరతారా..? లేదా? ఏమి చేస్తారనే చర్చ జరుగుతోంది. చూడాలి మరీ గడల శ్రీనివాస్ రావు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో..?

# భారీ పెట్టుబడులే లక్ష్యంగా రేవంత్ టూర్



**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. 10 రోజుల పర్యటనలో భాగంగా అమెరికాతో పాటు, దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగానే శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్పోర్ట్ నుంచి ముఖ్యమంత్రితో పాటు, మంత్రి శ్రీధర్ భాబు.. అధికారలు బృందం అమెరికాకు బయలు దేరి వెళ్లారు.రాష్ట్రానికి భారీ పెట్టుబడే లక్ష్యంగా సీఎం విదేశీ పర్యటన ఉంటుందని ఇది వరకే అధికారులు ప్రకటించారు. మొదట హైదరాబాద్ నుంచి న్యూయార్క్ చేరుకుంటారు. అక్కడ ఆరోజు రోజుల అనంతరం అక్కడి నుంచి నేరుగా దక్షిణ కొరియా వెళ్తారు. అనంతరం అక్కడ పర్యటన ముగించుకొని తిరిగి సీఎం బృందం ఈ నెల 14వ తేదీన ఉదయం హైదరాబాద్కు తిరిగి చేరుకుంటారు.ఈ పది రోజుల పర్యాటనలో భాగంగా సీఎం బృందం పారిశ్రామిక దిగ్గజాలతో 52 సమావేశాల్లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా రూ. 50 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల రంగంలో పెట్టుబడులు పెట్టాలని అంతర్జాతీయ కంపెనీలతో చర్చలు జరపనున్నారు. వీరిలో ప్రముఖంగా అమెజాన్ వైస్ ప్రెసిడెంట్, కాగ్నిజెంట్ సీఈవో, ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ సీవోవో, పెప్సీ కో సీనియర్ మేనేజ్మెంట్, అమెరికన్ ఎయిర్లైన్స్కు చెందిన వారు ఉన్నారు.ఇక ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితోనూ సీఎం భేటీ కానున్నారు. ఈ నెల6వ తేదీ వాషింగ్టన్లోని ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఈ మీటింగ్ ఉండనుంది. మూసీ ప్రాజెక్టుతోపాటు రాష్ట్రంలో చేపడుతున్న ఇతర ప్రాజెక్టుల గురించి ఆయనకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎం బృందం వివరించనుంది. ఈ ప్రాజెక్టుల్లో ప్రపంచ బ్యాంకు భాగస్వామ్యం కావాలని, ఆర్థిక సాయం చేయాలని కోరే అకవాశాలు ఉన్నాయి.ఇక స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ కూడా సీఎం సందర్శించనున్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్యంపైనా అక్కడి డీన్తో మాట్లాడనున్నారు.